క్లుప్తంగా

మూడో విడతలో పెండింగ్ పనులు

బాడంగి: 'నాడు –నేడు' ఫేజ్ 1,2లలో మిగిలిపోయిన పెండింగ్ పనులను ఫేజ్ –3లో ప్రతిపాదించి పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు అధికారులను కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాడు - నేడు ఫేజ్-3 ప్రతిపాదిత పనులపై హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రామారావు మాట్లాడుతూ, అవసరమైన పాఠశాలలో కొత్తగా అదనపు తరగతి గదులు, ప్రహరీలు, కిచెన్ షెడ్లు, టాయిలెట్ గదులు, రన్నింగ్ వాటర్ వంటివి సమకూర్చాలన్నారు. డీఎల్డీఓ రవీంద్ర మాట్లాడుతూ, అవసరమైన పనులు నివేదిస్తే, ఉపాధి హామీ పథకం నిధులతో చేపడతామని చెప్పారు. మండలంలో మొత్తం 17 ప్రాధాన్యత గల పనులను ప్రతిపాదిస్తున్నామని.. ఇందుకు గాను 3,96,73,300 రూపాయలతో అంచనాలు తయారు చేసినట్లు ఎంపీడీఓ అక్కారావు తెలిపారు. సమావేశంలో ఎంఈఓ కృష్ణమూర్తి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. గ్రంథాలయంలోని అన్ని పుస్తకాలను ప్రదర్శనగా ఏర్పాటు చేసి వాటికి సంబంధించిన విషయాలను లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతోమంది స్నేహితుల కంటే ఒక మంచి పుస్తకం మేలని తెలిపారు.

ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

- వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి వీటీ రామారావు

రాజాం సిటీ: ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు సిబ్బందికి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వీఏఏలు, ఆర్బీకే సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతుల అవసరాల మేరకు విత్తనాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవడంతో పాటు వాటి మొలక శాతాన్ని పరీక్షించి పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. అలాగే భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగు ప్రాముఖ్యతను రైతులకు వివరించాలన్నారు. సీసీఆర్సీ కార్డులు, పీఎం కిసాన్ తదితరాలపై చర్చించారు. జగనన్నకు చెబుదాం టోల్ఫ్రీ వినియోగించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రరావు, అన్నపూర్ణ, నాలుగు మండలాల ఏఓలు, ఆర్బీకే సిబ్బంది, వీఏఏలు పాల్గొన్నారు.

010 పద్దుకింద వేతనాలు చెల్లించాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం రాజాంలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 31 నుంచి జూన్ 9 వరకు నిర్వహించనున్న ప్రచారజాతను జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు టైంస్కేల్ వర్తింపజేయాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, పట్టణం విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, శంకరరావు, కృష్ణ, అనీల్, శ్రీనివాసరావు, కాశి, అచ్యుతరావు, రవి, లక్ష్మి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

సంతకవిటి: మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఓ త్రినాథ్, ఈసీ మురళి బుధవారం సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులకు వచ్చే వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని, వేతనదారులతో రెండు పూటలా పనిచేయించాలని, రోజువారీ వేతనం రూ.250 నుంచి రూ.260 వరకు వచ్చేలా చూడాలని సూచించారు. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

ఉపాధిపనులు పరిశీలన

రేగిడి: ఉపాధిహామీ పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని కొమిర, లక్ష్మీపురం, ఆడవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. వేతనదారులు కొలతల ప్రకారంగా పనులు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు.

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరాం పరిశీలించారు. వేతనదారులకు అవగాహన కల్పించారు. కొలతలు ప్రకారం పనులు చేయాలని సూచించారు. అమృత సరోవర్ చెరువుల్లో నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే సీఎం లక్ష్యం

- ప్రతిపక్షాలవి తప్పుడు ఆరోపణలు
- అమలు చేసిన పథకాలను ధైర్యంగా చెబుతున్నాం
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



రామభద్రపురం: పాతరేగలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రామభద్రపురం: పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పాతరేగలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల నాలుగేళ్లలో కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సంతకంతో కూడిన బుక్లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీవాసులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగనన్న బాటలోనే అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తామంతా ముందుకు సాగుతున్నామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగనన్న అమలు చేసున్తన్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందని తెలిపారు. జగనన్న మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటే ప్రతి ఇల్లూ సంక్షేమ పథకాలతో కళకళలాడుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం రాజ్యమేలుతుంటే ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులకు ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, వైఎస్సార్సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ గొట్టాపు రాజు, ఎంపీటీసీ సభ్యుడు పెద్దింటి రామినాయుడు, నాయకులు గొర్లి శ్రీనివాసరావు, పెద్దింటి పైడపునాయుడు, పెద్దింటి సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్: ఎమ్మెల్యే జోగులు

రాజాం: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పేదల పక్షపాతి అని, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని లచ్చయ్యపేట సచివాలయ పరిధి మల్లికార్జునకాలనీ, మెహర్బాబా నగర్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిపత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేస్తున్నారని, కోవిడ్ విపత్తు సమయంలో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు నిలుపుదల చేయలేదని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయని, వారి మాటలు నమ్మొద్దని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్మోహన్రెడ్డినే సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ నేతలు చల్లా జయరాం, పిచ్చుక శ్రీనివాసరావు, బొమ్మన మున్నా, కుప్పిలి గణపతి, జినగం ఈశ్వరరావు, బి.కృష్ణ, ఆసపు సూర్యం, చప్పటి పెంటయ్య, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సీహెచ్.ప్రసాద్, ఇంజినీరింగ్ సూపర్వైజర్ శ్రీధర్, మెప్మా టీఎంసీ రత్నం, వంజరాపు విజయ్కుమార్, శాసపు వేణుగోపాలనాయుడు, రమ్య, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



రాజాం: మల్లికార్జునకాలనీలో సంక్షేమ లబ్ధిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వలంటీర్లు సంక్షేమ వారధులు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే కంబాల, ఎమ్మెల్సీ పాలవలస



వంగర: కొప్పర గ్రామ వలంటీర్ చప్ప మౌనికను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



సంతకవిటి: వలంటీర్ను సత్కరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్ తదితరులు



రాజాం సిటీ: వలంటీర్లను సత్కరిస్తున్న కమిషనర్ కృష్ణారావు, వైఎస్సార్సీపీ నాయకులు

వంగర: గ్రామ వలంటీర్లు సంక్షేమ వారధులు అని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంతో వలంటీర్లదే కీలక పాత్ర అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సేవారత్న పురస్కారాలు పొందిన వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని, ప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, పాలవలస దవళేశ్వరరావు, ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మండాకురిటి సచివాలయంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి 27 మంది వలంటీర్లను సేవామిత్ర పురస్కారాలతో సత్కరించారు.

రాజాం సిటీ: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సేవా వారధులు వలంటీర్లని కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వైఎస్సార్సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి మిర్తిరెడ్డి, ఇందిరమ్మకాలనీ సచివాలయాల్లో సేవలందిస్తున్న వలంటీర్లను సత్కరించారు.

రేగిడి: మండలంలోని కందిశ, కోడిశ, సరసనాపల్లి గ్రామాల్లో వలంటీర్లకు ఎంపీడీఓ జి.కాశీవిశ్వేశ్వరరావు సత్కారించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మండల సమావేశంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అహర్నిశలు కృషిచేస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పేదరిక నిర్మూలనే ప్రధాన అజెండాగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేన్నారన్నారు. న్నట్లు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వాటిని ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధికి అధికారులు సహకరించాలని, నిధులు మంజూరుకు తమ వంతు కృషిచేస్తామని అన్నారు. గత ప్రభుత్వ పాలనకు.. వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలని సర్పంచ్లు, ఎంపీటీసీలకు పిలుపునిచ్చారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారాయణ, మండల విప్ తెంటు కుమారి, జేసీఎస్ కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

రేగిడి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయివలస రైతుభరోసా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. జొన్నలు, సజ్జలు, సామలు, బీర, బెండ, బొబ్బర్లు, కొర్రలు తదితర 28 రకాల విత్తనాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఖరీఫ్లో సాగుచేసే వరిపంటలో జీలుగ, కట్టిజనుమును వేసుకుంటే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, ఐసీఆర్పీలు పి.తవిటినాయుడు, జి.సింహాచలం పాల్గొన్నారు.

బస్షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

వంగర: స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో బస్షెల్టర్ నిర్మాణానికి ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.4.95 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయడంతో దీని నిర్మాణానికి భూమి పూజ చేశారు. బస్షెల్టర్ నిర్మాణం పూర్తయితే కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుందని ఎంపీపీ తెలిపారు.

శతశాతం ఈ క్రాప్ చేయించాలి

బొబ్బిలి: రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బంది ఈ ఖరీఫ్ సీజన్కు సంబంధించి నూటికి నూరు శాతం ఈక్రాప్ చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. పట్టణంలోని ఆర్బీకేలు, క్రిమిసంహారక మందుల డీలర్లతో బుధవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్బీకేల పరిధిలోని రైతులకు ఎరువులు, విత్తనాలు ఏ పరిమాణంలో అవసరమో నమోదు చేయాలన్నారు. అలాగే రైతుభరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సహాయం పథకానికి ఎంత మంది రైతులు అర్హుల్లో గుర్తించాలని సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

రైతులకు పురుగు మందులు, ఎరువులను అవసరం మేరకు అందిస్తున్నామని, ఎవరైనా డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా ఏడీఏ అన్నపూర్ణ, బొబ్బిలి సహాయ సంచాలకుడు మజ్జి శ్యాంసుందరరావు, నాలుగు మండలాల ఆర్బీకే సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

చెట్లకొమ్మల తొలగింపు

రేగిడి: మండలంలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్కో ఏఈ అప్పన్న అన్నారు. మండలంలోని వండానపేట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి తదితర గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లను తాకుతున్న చెట్టుకొమ్మల తొలగింపు పనులను బుధవారం చేపట్టారు.

బొబ్బిలిలో భారీ వర్షం

బొబ్బిలి: పట్టణం, పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దావాల వీధి, రాజ్మహల్ కాలనీల్లో రెండు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం తగ్గిన వెంటనే ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి ఆదేశాల మేరకు పట్టణ ఏఈ సాంబశివరావు సిబ్బందితో వెళ్లి విద్యుత్ లైన్లను సరిచేయించారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్క్రాస్ వితరణ

రేగిడి: మండలంలోని పోరాం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు అగ్నికి ఆహుతైన విషయం విధితమే. బాధితులను తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బొక్కేల రాంబాబు, రెడ్క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, తదితరులు బుధవారం పరామర్శించారు. రూ.5వేలు విలువచేసే వంటపాత్రలు, సరుకులు, టార్పాలిన్లు అందజేశారు.

సత్కారం..

బొబ్బిలి: మండలంలోని కారాడ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి బడే సోమశేఖర్ (584 మార్కులు), ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోదిలను విజయవాడలో బుధవారం ఘనంగా సత్కరించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి చెన్నుబోయిన వేణుగోపాలకృష్ణ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాములు, బీసీ సంక్షేమ డైరెక్టర్ అర్జునరావు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి కృష్ణమోహన్ సత్కరించి, అభినందించారు. భవిష్యత్లో గురుకులాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఫీల్డ్ అసిస్టెంట్పై విచారణ

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవిపై స్పందనలో ఫిర్యాదు రావడంతో అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ప్రతి వ్యక్తి వద్దా డబ్బులు తీసుకుంటోందని ఫిర్యాదులో పేర్కొనడంతో ఏపీఓ జనార్దనరావు నేరుగా వేతనదారులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరలతో మాట్లాడుతూ.. గునపాలు, ఇతర పనిముట్లను సాన బెట్టేందుకు రూ.50 ఇచ్చామని కొందరు చెప్పారు గాని.. లంచాలు ఇచ్చినట్లు ఎవ్వరూ చెప్పలేదన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

బొబ్బిలి: మండలంలోని పిరిడిలోని రాజయ్య కోనేరునే ఆక్రమించుకున్నారని గ్రామస్తులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చెరువులో కంకర, మట్టి వేసి ప్లాట్లుగా విభజించి, విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ రాజారావు వివరణ కోరగా.. సర్వేయర్తో శుక్రవారం విచారణ చేపట్టి వాస్తవాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

సంతాపం

బాడంగి: విశ్రాంత జర్నలిస్ట్ ఏటూరి బాలాజీ (47) మృతిపై స్థానిక ప్రెస్క్లబ్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. బాలాజీ ఆంధ్రభూమి, వార్తా పత్రికల్లో మండల ప్రతినిధిగా పనిచేశారు. అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి తల్లి లక్ష్మి, తండ్రి వెంకటరావు ఉన్నారు. ఈయన మృతి పట్ల వైఎస్సార్సీపీ నాయకుడు పెద్దింటి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్, కాంగ్రెస్ నాయకుడు ముగడ వెంకటరమణ, బీజేపీ నాయకుడు కందుల అప్పలరాజు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు నేత్ర వైద్యశిబిరం

బొబ్బిలి: శంకర్ ఫౌండేషన్, చెలికాని అచ్యుతరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పిరిడి సత్యసాయి మందిరం వద్ద గురువారం ఉదయం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి సి. రామానుజం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు రెండు కళ్లు

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



కారుమామిడివలసలో గిరిజనులతో డిప్యూటీ సీఎం రాజన్న, తదితరులు



పిట్టాడలో వలంటీర్లను సత్కరిస్తున్న రాజన్నదొర, తదితరులు

మెంటాడ: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పిట్టాడ సచివాలయం పరిధి రాయివలస, కారుమామిడివలస, వాణిజ గ్రామాలలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, వైఎస్సార్సీపీ పాలనలో ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ బుక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల పట్ల లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారన్నారు. గత పాలనకు.. ప్రస్తుత జగనన్న పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలే చెబుతున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ పథకాలన్ని పచ్చచొక్కాలవారే దక్కించుకునేవారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్సులు గల్లంతు కావడం ఖాయమని చెప్పారు. సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

వలంటీర్లు నిస్వార్థసేవకులని, నేడు ప్రభుత్వ పథకాల అమలులో ప్రభుత్వానికి ఇంత మంచి పేరు రావడానికి వలంటీర్లే ప్రధాన కారకులని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. పిట్టాడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పలువురు వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ, వలంటీర్లు పార్టీలకతీతంగా నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, సర్పంచ్ నాయుడుబాబు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, గండి తాగూర్నాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



వలంటీర్ సిరికి కమలను సన్మానిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, అధికారులు, మండల ప్రజాప్రతినిధులు

తెర్లాం: వలంటీర్లు సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని విజయరాంపురంలో వలంటీర్లకు వందనం పేరిట పలువురు వలంటీర్లను బుధవారం సత్కరించారు. సర్పంచ్ బూరి మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డికి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు రెండు కళ్లులాంటివని తెలిపారు. వలంటీర్లు అవినీతికి తావులేకుండా పని చేస్తున్నారని చెప్పారు. వలంటీర్ల సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించడం గొప్ప విషయమన్నారు. వలంటీర్లంతా బాధ్యతాయుతంగా పనిచేసి ముఖ్యమంత్రికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 313 మంది గ్రామ వలంటీర్లకు అవార్డు ద్వారా వచ్చిన రూ.31 లక్షల 80 వేల చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ గర్భాపు లూర్దు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, పార్టీ సీనియర్ నాయకులు బోను అప్పలనాయుడు, తెంటు సత్యంనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జూలైలోగా రీ సర్వే పూర్తికావాలి

- ఎస్డీసీ సుదర్శనదొర



బాడంగి రెవెన్యూ కార్యాలయంలో సమీక్షిస్తున్న ఎస్డీసీ సుదర్శనదొర

బాడంగి: బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తొలి విడత రీసర్వే పూర్తవ్వగా.. మిగిలిపోయిన గ్రామాలలో రీసర్వే పనులు జూలై నెలాఖరులోగా పూర్తిచేయనున్నట్లు సంబంధిత అధికారులను ఆదేశించానని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర అన్నారు. మండలంలో భూముల రీసర్వే పనుల పరిశీలన బుధవారం మండలానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రీసర్వే పూర్తయిన గ్రామాలలో 60 వేల సర్వే రాళ్లు పాతినట్లు చెప్పారు. ఇంతవరకు ఎక్కడా రైతుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాలేదన్నారు. గ్రామ కంఠాలకు చెందిన పంట కల్లాల విషయంలోను, ఉమ్మడి జాగాల పంపిణీ విషయంలో కొద్దిగా ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. బాడంగి మండలంలో ఇప్పటివరకు 21 గ్రామాలలో భూముల రీసర్వే పనులు పూర్తవ్వగా.. మిగిలిన 8 గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్ పనులు ప్రారంభమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ, రీ సర్వే హెచ్డీటీ తులసీ రామకృష్ణ, మండల సర్వేయర్ సాయికుమార్, ఎంఆర్ఐ సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గ్రామ స్థాయిలో ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందించి గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేయడమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మండలంలోని చిన్నశిర్లాంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ప్రతిపక్షాలు, పచ్చమీడియా కలిసి చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, గడపగడపకు వెళ్లినపుడు మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నట్లు చెబుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనర్సమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, రాష్ట్ర పోలినాటివెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ కింజరాపు పద్మావతి, సర్పంచ్లు టంకాల ఉమ, లెంక రాంబాబు, రాజాం, వంగర మండలాల పార్టీ కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, ఎంపీడీఓ జి.కాశీ విశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, పీఆర్జేఈ రామకృష్ణ, సర్పంచ్లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

రేగిడి: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుధవారం చిన్నశిర్లాం గ్రామంలో భారత్ డైనమిక్ లిమిటెడ్వారి ఆర్థిక సాయంతో వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్డీఏ ద్వారా నడుస్తున్న కుట్టు శిక్షణా కేంద్రం మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే రెండో బ్యాచ్ శిక్షణకు హాజరైన వారికి వెల్కమ్ కిట్లను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్తో కలిసి అందజేశారు. ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రోత్సాహాన్ని, ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం సాధికారిత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎం టి.మంగమ్మ, ట్రైనర్ అరుణకుమారి పాల్గొన్నారు.

చెరకు రైతుకు అవగాహన

రాజాం: స్థానిక సూర్య దుర్గా కల్యాణ మండపం వద్ద సంతకవిటి, రణస్థలం, గరివిడి ప్రాంతాలకు చెందిన చెరకు రైతులకు సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. చెరకు సాగులో నూతన పద్ధతులపై సూచనలు, సలహాలు అందించారు. డీజీఎం రమేష్రెడ్డి, ఏజీఎం అప్పారావు పాల్గొన్నారు.